బదిలీల బేరం...!

- రెవెన్యూలో తహశీల్దార్, డిటి, ఆర్ఐలకు సిఫార్సు
- రూ.లక్షల్లోనే వసూళ్లు
- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యే, ఇతర నేతల చుట్టూ ప్రదక్షిణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల బదిలీలను అసరా చేసుకొని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. కీలక శాఖలల్లో బదిలీ చేయించేందుకు రూ.లక్షలల్లోనే డిమాండ్ చేస్తున్నారు. సిపార్సు లేఖలు ఉన్న వారిని బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. రెవెన్యూ, సర్వే, పంచాయితీరాజ్ ఇతర శాఖలల్లో ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మే 12న ఉద్యోగుల బదిలీలపై నిషేదం ఎత్తివేస్తూ ఉత్తర్వులను జారీచేసింది. జూన్ 2 వరకు ఉద్యోగుల బదిలీలను జరిగేలా చర్యలు తీసుకుంది. ఒకే కేంద్రంలో దాదాపుగా ఐదేళ్ల పాటు సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులందరిని బదిలీలు చేయాలని ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది.

సిపార్సు లేఖల కోసం కూటమి నేతల చుట్టూ

ఉద్యోగుల బదిలీల కోసం తమకు కావాల్సిన స్థానాలకు వచ్చేందుకు సిపార్సు లేఖలను పొందుతున్నారు. ఈ సిపార్సు లేఖలను తీసుకునేందుకు కూటమి నేతలు చుట్టూ తిరుగుతున్నారు. ఏ నియోజికర్గంలో రావాలనుకుంటే అ నియోజికవర్గ ఎమ్మెల్యే సిపార్సు లేఖలను తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే సిపార్సు లేఖలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున వసూళ్ల చేస్తున్నారు. జిల్లాలో రెవెన్యూ శాఖలో తహశీల్దార్, డిప్యూటి తహశీల్దార్, అర్ఐ పోస్టులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఈ పోస్టులకు అయా కేంద్రాలకు వచ్చేందుకుగాను పెద్ద ఎత్తున ముడుపులిచ్చేందుకు కూడా వెనుకడుగు వేయడంలేదు. తహశీల్దార్ స్థానాలకు రూ లక్షల్లోనే డబ్బులివ్వడమే గాకుండా ముందస్తుగానే పనులు చేసేవాటిలో పర్సెంటేజీలను మాట్లాడుకుంటున్నారు. మండల సర్వేయర్ పోస్టులకు ఈ రకమైన వసూళ్లను చేస్తున్నారు. సిపార్సు లేఖలున్నటువంటి ఉద్యోగుల బదిలీల దరాఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు చెప్పడంతో వాటిని మాత్రమే తీసుకుంటున్నారు. పంచాయితీరాజ్‌శాఖలో గ్రామపంచాయి కార్యదర్శి బదిలీల సిపార్సు లేఖలున్న వారికి మాత్రమే బదిలీ చేస్తున్నారు. మేజర్ పంచాయితీలకు పోస్టింగ్‌లను వేయించుకునేందుకు రూ.లక్ష నుండి రూ.2లక్షలకుపైగా సిపార్సు లేఖల కోసం డబ్బులను వసూలు చేసినట్లు తెలిసింది.

ఉద్యోగ సంఘాల సిఫార్సుల కోసం

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఉద్యోగసంఘాల నుండి సిపార్సు లేఖలను తీసుకొని కొంతమంది ఐదేళ్ల సర్వీసు పూర్లయినా ఇక్కడే కొనసాగుతున్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘంలో అఫీస్ బేరర్‌లకు బదిలీల నుండి మినహాయింపు పొందేందుకు అవకాశం ఉంటుంది. అనేక ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు పొందిన సంఘాలల్లో రాత్రికి రాత్రే అఫీసు బేరర్‌లుగా నియమితులై వారికి బదిలీలనుండి మినహాయింపు పొందుతున్నారు. అలాంటివారికి కూడా నియమాక పత్రాలను ఉద్యోగ సంఘాల నేతలు అందజేస్తున్నారు.

పేదలపై 'రియల్' పంజా..!

- రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏజెంట్లుగా పోలీసులు
- బాధితుడు నాగన్న కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేయించిన వైనం
- బాధితుని ముగ్గురు కుమారులపై రౌడీషీటర్లుగా కేసులు నమోదు
- నిజ నిర్ధారణ కమిటీ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విచారణ చేపడుతున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు

కల్లూరు మండలం ఉలిందకొండ, కొల్లంపల్లి తండా, ఎర్రకత్వ మూడు గ్రామాల పరిధిలోని పేద ప్రజలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారి రాగమయూరి కంపెనీకి చెందిన కెజె రెడ్డి రైతులను భయపెట్టి తన అనుచరులతో రియల్ పంజా విసిరాడు. ఈ క్రమంలో నాగన్న కుటుంబం గ్రామ బహిష్కరణకు గురైంది. అతని ముగ్గురు కొడుకులపై కేసులు నమోదు చేసి రౌడీషీటర్లుగా పోలీసులు ముద్రవేశారు. పోలీసులు రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏజెంట్లుగా మారి పేదలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు సమగ్ర విచారణ చేసి ప్రకటించారు. నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. రియల్ వ్యాపారం పేరుతో కెజె రెడ్డి తక్కువ ధరకు ఎకరాకు రూ.50,000 చెల్లించి, ఎకరాకు రూ.ఆరు లక్షలు చెల్లించినట్లు రిజిస్టరు విక్రయ పత్రాలను సృష్టించినట్లు కమిటీ దృష్టికి ప్రజలు తెచ్చారు. తమ పట్టా భూముల మధ్య ఉన్న చుక్కల భూములు, ప్రభుత్వ భూములను తమ పెద్దలకాలం నుండి తాము సాగు చేసుకుంటున్నామని, వాటిని కెజె రెడ్డి విక్రయించలేదని బాధిత రైతులు చెప్పారు. తాము సాగు చేసుకుంటున్న భూములను తమ అనుమతి లేకుండానే బలవంతంగా పోలీసులను తీసుకువచ్చి ఆ పొలంలోకి తమను వెళ్లకుండా కెజెరెడ్డి ఆక్రమించారని చెప్పారు. రైతు నాగన్న మాట్లాడుతూ తనను పొలంలోకి వెళ్లకుండా కెజెరెడ్డి మనుషులు ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు అడ్డుకున్నారని చెప్పారు. వారిని వ్యతిరేకించినందుకు తనమీద చదువుకుంటున్న తన ముగ్గురు కొడుకుల మీద తప్పుడు కేసులు బనాయించి సిఐ చంద్రబాబు, ఎస్ఐ ధనుంజయ బయంకరంగా హింసించారని చెప్పారు. నాగన్న భార్య వెంకటేశ్వరమ్మను కూడా ఇంటికి తాళం వేసి ఇంటి నుండి తరిమివేసి గ్రామం నుండి బహిష్కరించినారని నాగన్న అతని భార్య పిల్లలు కమిటీ దృష్టికి తెచ్చారు. తనను గ్రామం నుండి బహిష్కరించిన తరువాత పోలీసులను తీసుకువచ్చి తన పొలం చుట్టూ స్థంబాలు నాటడానికి ప్రయత్నం చేసినారని నాగన్న కమిటీ సభ్యులను పొలం వద్దకు తీసుకువెళ్లి చూపించారు. ఈ విషయమై కెజెరెడ్డి మనుషులు ఈశ్వరయ్యను అడగగా పోలీసులు ఉండి తనచే నాగన్న పొలానికి స్తంభాలు నాటించినారని చెప్పారు.

నిర్ధారణలు: రాగ మయూరి రియల్ ఎస్టేట్ ఓనర్ కెజె రెడ్డి తన అనుచరుడైన నాగరాజు పేరు మీద రైతులను భయపెట్టి వారికి ఎకరాకు రూ.50 వేలు చెల్లించి లక్షల విలువచేసే సారవంతమైన భూములను రిజిస్టర్ కార్యాలయంలో అధిక విలువలు ఎకరానికి రూ.ఆరు లక్షలు చూపించి రిజిస్టర్ చేసుకున్నట్లుగా నిర్ధారించారు. తాను తన పెద్దల కాలం నుండి సాగు చేసుకుంటున్న భూమిని కెజెరెడ్డి వారికి ఇవ్వడానికి అంగీకరించలేదని నాగన్న అతని కుమారులు సంజీవ్, విష్ణు, అశోక్ ముగ్గురి పైన తప్పుడు కేసులు బనాయించి రిమాండ్‌కు పంపించినట్లు నిర్ధారించారు. కెజె రెడ్డి మాట విని పోలీసులు నాగన్నను అతని కుమారులను ముగ్గురిని హింసించి వారి చదువులు భంగం చేసి వారి మీద అతని భార్య పిల్లలపై రౌడీషీటర్లుగా కేసు ఓపెన్ చేశారని నిర్ధారించారు. నాగన్నను అతని భార్య పిల్లలను ఉలిందకొండ గ్రామం నుండి పోలీసులు బహిష్కరించారని నిర్ధారించారు.

పరిష్కరించాల్సిన డిమాండ్లు: నాగన్న అతని కుమారుల పైన పెట్టిన క్రిమినల్ కేసులను రద్దుచేసి వారిని వారి ఇంటికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. నాగన్న భార్య వెంకటేశ్వరమ్మ సమ్మతం పైన హింసాత్మక చర్యలకు పాల్పడి వారి భూములను వారు సాగు చేసుకోకుండా చేస్తున్న పోలీసుల పైన ఇతర అధికారుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిని శిక్షించాలి. సిఐ చంద్రబాబు, ఎస్ఐ ధనుంజయ అతని సిబ్బంది హింసించినందుకు నాగన్న కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి. కొంపల్లితండా, ఉలిందకొండ, ఎర్రకత్వ గ్రామాలలో కెజెరెడ్డి తన అనుచరుల పేరు మీద కొనుగోలు చేసిన భూములను సర్వే చేయించి ఆ భూముల విక్రయాలను రద్దుచేసి రైతులకు గతంలో ఎవరు సాగు చేసుకుంటున్నారో వారికి ఆ భూములను స్వాధీనం చేయాలి. ఆ గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములలో గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతులు ఎవరైతే ఉన్నారో వారికి పట్టాలు మంజూరు చేసి వారి పేరును వెబ్‌ల్యాండ్ రికార్డ్ నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలి.

నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు : ఆర్.రామకుమార్ ప్రధాన కార్యదర్శి ఒపిడి ఆర్ ఆంధ్ర ప్రదేశ్, పిట్టల శ్రీనివాస్ హైకోర్టు న్యాయవాది, ఎంఆర్ కృష్ణ సీనియర్ న్యాయవాది కర్నూలు జిల్లా కోర్టు, శేషఫణి బిసి జనసభ, ఎస్కె జయన్న సమాచార హక్కు ప్రచార రాష్ట్ర కార్యదర్శి, పర్వతనేని హరికృష్ణ ప్రజా పరిరక్షణ సమితి విజయవాడ, దేవిడ్ ప్రజా పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజుప్రజా పరిరక్షణ సమితి గుంటూరు, కరుణాకరరావు ఒపిడిఆర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు కర్నూలు, ఆర్ నర్సింలు ఒపిడిఆర్ కర్నూలు జిల్లా కార్యదర్శి, షేక్ బాజీద్ ముస్లిం చైతన్య పోరాట సమితి, హైకోర్టు న్యాయవాది పి.రఘునాథరెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించండి

-అధికారులకు కలెక్టర్ ఆదేశం
-ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో గ్రీవెన్స్ స్వీకరణ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రతి మండల స్పెషల్ ఆఫీసర్ గ్రామాల్లో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్య అయినా పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్పెషల్ అధికారులు 2 నెలల్లో మండలంలోని అన్ని గ్రామాలను పర్యటించాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పిహెచ్‌సి షాపులు, వసతి గృహాలు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లు శుభ్రత, పారిశుద్ధ్యం, డ్రైనేజ్ క్లీనింగ్ పరిశీలించి నిర్దేశించిన ప్రొఫార్మాలో తనిఖీ నివేదికలు ఇవ్వాలన్నారు. వర్షాకాలం మొదలవుతున్నందున పారిశుధ్యం, నీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియలు ప్రతి గ్రామంలో జరిగే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మాస్టర్ ట్రైనర్లు మండలాలలో ట్రైనింగ్ ఇచ్చిన వారిని వారి లాగిన్‌లో మ్యాపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాన్ని తగ్గించాలి

పర్యావరణంపై ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్య నివారణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మలేరియా నివారణకు చర్యలు

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా మలేరియాపై అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. మలేరియా నివారణ మాసోత్సవాల నిర్వహణ సందర్భంగా మలేరియాతో పాటు దోమల ద్వారా సంక్రమించే ఇతర వ్యాధులు డెంగ్యూ, చికున్ గున్యా వ్యాపించకుండా అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతి కళ, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రయివేట్ హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని అనేక ప్రైవేట్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ పేషంట్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్న హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు అబ్బాస్, మండల కార్యదర్శి ప్రకాష్, సహాయ కార్యదర్శి హరికిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను డివైఎఫ్ఐ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌ను పరిశీలించామని అక్కడ ఆరోగ్యశ్రీ కింద చేరిన రోగులకు ఉచితంగా వైద్యం అందించాల్సి ఉండగా రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఓమిని, కిమ్స్, శ్రీ చక్ర, లిమిలైఫ్, శ్రీ సహస్ర, యశోద, గౌరీ గోపాల్ తదితర హాస్పిటల్స్ తమ బృందం రోగులతో మాట్లాడి వివరాలు సేకరించిందన్నారు. హార్ట్ సర్జరీ, ఆర్తో సర్జరీల కోసం జాయిన్ అయినా ఆరోగ్యశ్రీ పేషెంట్ల నుండి శ్రీ చక్ర, ఓమ్ని, గౌరీ గోపాల్, డెలివరీ పేషెంట్లను అమీలియో, శ్రీ సహస్ర, అమృత, యశోద హాస్పిటల్స్ ఒక్కొక్కరి కేసిని రూ.10 వేల నుండి రూ.80 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కొన్ని హాస్పిటల్స్ మందుల పేరుతో ఎక్విప్మెంట్ పేరుతో మెడికల్ షాపులకు పంపి భారీగా బిల్లులు చేస్తే మరికొన్ని డైరెక్టుగా డబ్బులు కట్టించుకుంటున్నారన్నారు. సదరు హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. మరోసారి మీటింగ్ పెట్టి డబ్బులు వసూలు చేసే హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా తిక్కారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

తిక్కారెడ్డికి కేక్ తినిపిస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి జిల్లా కార్యాలయంలో కర్నూలులో నిర్వహించారు. పార్టీ నాయకులు మాజీ మంత్రి కెయి ప్రభాకర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సంజీవ కుమార్, డాక్టర్ జయ నాగేశ్వరరెడ్డి, కెయి. శ్యామ్‌కుమార్, బి.దస్తగిరి, కె.మీనాక్షినాయుడు, బి.వీరభద్రగౌడ్, రాఘవేంద్రరెడ్డి, డిసిసిబి ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ వై. నాగేశ్వరరావుయాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి వహీద్, కె.నాగేంద్ర పి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జె. పుల్లయ్యచౌదరి, మహిళా అధ్యక్షురాలు ఎస్.ముంతాజ్, కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో ఉన్నారు.పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ముందుగా పార్టీ నాయకులు తిక్కారెడ్డికి శాలువాలతో సన్మానించారు. కేక్ కట్‌చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. తిక్కారెడ్డి జిల్లా అధ్యక్షులుగా అతి తక్కువ కాలంలోనే అందరి మన్ననలు పొందారన్నారు.ఎన్నికల్లో గతంలో లేని విధంగా మెజార్టీ స్థానాలను గెలిపించడంలో ఎంతో శ్రమించారన్నారు.

జెఇఇలో కర్నూలు శ్రీ చైతన్యకు మంచి ర్యాంకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

S. MEGHANA

జెఇఇ అడ్వాన్స్డ్ ఫలితాలలో కర్నూలు శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీలలో ఎస్.మేఘన ఆలిండియా స్థాయిలో 9643వ ర్యాంకు, ఆర్.ఉపేంద్ర రెడ్డి 18414వ ర్యాంకు, పి. అభిషేక్ నాయక్ 2048 వ ర్యాంకు, జి.దీప్తి 28824వ ర్యాంకు, డి. జోయల్ అభినయ్ 4176 వ ర్యాంకు, ఎం.జీవన్ కుమార్ 5714 వ ర్యాంకు, సి.సాయి ఐశ్వర్య 6397 వ ర్యాంకు, కె. శ్రీలక్ష్మి 8294 వ ర్యాంకు, పి. వెంకట విశాల్ 9741 వ ర్యాంకు, సి.నవీనేష్‌నాథ్ 10069వ ర్యాంకు, కె.మోక్షిత్ సాయి 10343 వంటి ర్యాంకులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు దేశంలోని ఇంజినీరింగులో ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఎన్ఐటి, ఐఐటి లాంటి విద్యాసంస్థలలో ఎంపిక కాగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య కళాశాల ఎజిఎం మురళీకృష్ణ, డీన్ సరళ, డీన్ బాలాజీ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి , విద్యార్థులకు తల్లిదండ్రులకు కళాశాల తరఫునుంచి ధన్యవాదాలు తెలిపారు.

నేడు రాక్ గార్డెన్స్‌లో యోగ కార్యక్రమం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని రాక్ గార్డెన్స్ పర్యాటక ప్రాంతంలో మంగళవారం ఉదయం యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులు విద్యార్థులు పాల్గొననున్నారు. యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్య పేర్కొన్నారు.

జిజిహెచ్ ఇన్ గేట్ ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

జిజిహెచ్ ఇన్‌గేట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సోమవారం వైద్యశాల ఇన్ గేటును ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు సోమవారం ప్రారంభించారు. జిజిహెచ్‌కు ప్రతిరోజు వేలాదిమంది రోగులు, రోగుల బంధువులు, వైద్యులు వైద్య సిబ్బంది కాలినడకన ద్విచక్ర ఆటోలు కార్లలో రాకపోకలు చేస్తుంటారు. ఒకే గేటు లోనే రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో ప్రజాశక్తి దినపత్రికలో మే11 'గేటు ఒకటే సమస్యలు అనేకం' పేరుతో కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన వైద్యాధికారులు సోమవారం ఆసుపత్రి ఇన్‌గేట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఇన్ గేటు, అవుట్ గేట్ల ద్వారా పేషంట్లకు ఇబ్బంది కలగకుండా రెండు గేట్లు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. అవుట్ గేటు, ఇన్ గేటు ద్వారా పేషంట్లు సేవలను ప్రతిష్టంగా అమలు చేయాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు పార్కింగ్ వెహికల్ లోకేషన్‌లో ఐడెంటిఫికేషన్ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ పెట్టకుండా చర్యలు తీసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది వెహికల్ పార్కింగ్ విషయంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సిపిఐ ధర్నా -అధికారులకు వినతి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఐ రాష్ట్ర నాయకులు పి.రామచంద్రయ్య, తదితరులు

అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం పత్తికొండ చదువుల రామయ్య భవనం నుండి ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలతో కలిసి నాలుగు స్తంభాల మండపం వరకు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ ఎంవి రమేష్‌కు ఇచ్చారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కృష్ణయ్య, కారుమంచి, పెద్ద ఈరన్న పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : అర్హులైన పేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోడుమూరు లో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ముందుగా ఇంద్రజిత్ గుప్తా నగర్ కాలని నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం వినతిపత్రం ఇచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు, జిల్లా సమితి సభ్యులు సులోచనమ్మ, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి పాల్గొన్నారు.

మద్దికెర : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ హసీన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డిజిఎం, డీన్ , అధ్యాపకులు

జెఇఇ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జెఇఇ అడ్వాన్స్డ్ పరీక్ష ఫలితాలలో మరోసారి కర్నూలు నారాయణ ప్రభంజనం సృష్టించింది. కర్నూలు నారాయణ కళాశాల నుండి వివిధ క్యాటగిరీలలో కె.జీవన్ కుమార్ 143 ర్యాంకు, పి.జశ్వంత్ నాయక్ 174 ర్యాంకు, టి.మిథున్ సాయి కుమార్ 1221 ర్యాంకు, ఎ.మజీదీప్ 1817 ర్యాంకు, ఎస్.సాయి మానస్ గౌడ్ 2893 ర్యాంకు, చరణ్ కుమార్ 3433 ర్యాంకు, వై.సాహితి 3364 ర్యాంకులు పొందారు. 500 లోపు ఇద్దరు, 2,000 లోపు నలుగురు, 5,000 లోపు ఆరుగురు ర్యాంకులు వచ్చాయి. ఆల్ఇండియా ఓపెన్ కేటగిరిలో కె.జీవన్ కుమార్ 889 ర్యాంకు, టి.మిథున్ సాయి కుమార్ 6015 ర్యాంకు, సాయి శ్రుతి 6124 ర్యాంకు, కె.సాయి భాస్కర్ 9298, ఎస్ హర్షిత 12007 ర్యాంకు, ఎస్. సాయి మానస్ గౌడ్ 12176 ర్యాంకు, చరణ్ కుమార్ 13982 ర్యాంకు, శివ ధనుష్ 15051 ర్యాంకు, పి.జశ్వంత్ నాయక్ 19411 ర్యాంకు, వై. సాహితి 23517 ర్యాంకు, శాంత జోన్స్ 25965 ర్యాంకు, ముస్తఫిమ్ 27197 ర్యాంకు, ఆల్ ఇండియా ర్యాంకులను పొందారు. ఓపెన్ కేటగిరిలో 5000 లోపు ఒక్కరు, 10,000లోపు నలుగురు, 20,000 లోపు తొమ్మిది మంది, 25,000 లోపు 10 మందికి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డిజిఎం టి. గోవర్ధన్ రెడ్డి, డీన్ వేణు గోపాల్ రెడ్డి ప్రిన్సిపల్ విజయమోహన్, వెంకటరామన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

K SAI BHASKAR
H.T.NO.256032315

MITHUN SAI KUMAR
H.T.NO.256031046

K JEEVAN KUMAR
H.T.NO.256032299

K SAI SRUTHI
H.T.NO.256032137

తండ్రి మందలించాడని విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి కురవ రామకృష్ణను తండ్రి మందలించడంతో క్షణికావేశంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు... విద్యార్థి రామకృష్ణ ఫుట్‌బాల్ ఆటలో ఓడిపోయాడు, మొబైల్ ఫోన్‌ను ఎక్కువగా వినియోగించడంతో తండ్రి మందలించాడు. తండ్రి మందలింపుతో మనస్తాపానికి గురై ఈనెల ఒకటో తేదీన గడ్డి మందు తీసుకున్నాడు. వెంటనే చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పారదర్శకంగా 'రేషన్' పంపిణీ

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను లబ్ధిదారులకు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ డీలర్లకు సూచించారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో టిడిపి నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 16 గ్రామాల్లోనూ రేషన్ డీలర్లందరూ ఎక్కడా సమస్యలు ఎదురుకాకుండా రేషన్ పంపిణీ సజావుగా జరిగేటట్లు చూసుకోవాలన్నారు. సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారులకు, తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు. రేషన్ పంపిణీని సంబంధిత రెవెన్యూ కార్యదర్శులు కూడా పరిశీలించాలని తెలిపారు. ఆర్ఐ సునీత, వీఆర్ఓలు మల్లికార్జున, వన్నూరు స్వామి, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, సుధా, రాజు, ముద్దయ్య, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తున్న తహశీల్దార్

సృజనాత్మకతను వెలికితీయాలి

- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ముగ్గుల పోటీల ద్వారా ప్రదర్శించాలని మున్సిపల్ చైర్పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ తెలిపారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులను చైర్మన్ లోకేశ్వరి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 21న యోగా డే సందర్భంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించామని తెలిపారు. విజేతలకు ఈనెల 21న బహుమతి అందజేస్తామన్నారు. 22 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. మొదటి బహుమతి పద్మ, రెండో బహుమతి శ్రీవల్లి, మూడో బహుమతి రత్నమ్మ, సువర్ణ, మహాలక్ష్మి ఎంపికయ్యారు. మెప్మా సిఎం మేనేజర్ జిలాని బాష, సిఒ జావీద్ ఉన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

జగనే అసలైన వెన్నుపోటు దారుడు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసలైన వెన్నుపోటు దారుడని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిడిపి మాజీ ఇన్చార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. సోమవారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4న రాష్ట్ర ప్రజలందరూ జగన్ వెన్నుపోటు విముక్తి దినంగా జరుపుకోవాలన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించకపోగా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా చేసి యువతను నాశనం చేయడం యువతకు వెన్నుపోటు పొడవడం కాదా అని నిలదీశారు. జిఒ 117ను తీసుకొచ్చి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5 లక్షల మంది విద్యార్థులను పాఠశాల నుంచి గెంటివేయడం విద్యార్థులకు వెన్నుపోటు పొడవడం కాదా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధమని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యాన్ని ఏరులై పారించి రూ.వేల కోట్లు జేబులో నింపుకోవడం వెన్నుపోటు పొడవడం కాదా అని నిలదీశారు. నాయకులు మురళీ, కపటి బూత్ కన్వీనర్ మహాదేవ, మాజీ ఎంపిటిసి తిమ్మారెడ్డి, రాఘవరెడ్డి, బాబూరావు, విజయ్, భరత్ కుమార్, మని, హనుమంతు, అబ్బుల్, ఆంజనేయులు, సీతారాం, తిరుపాల్, అశోక్, ఖాసీం ఉన్నారు.

కెజిబివిలో సీట్లు పెంచాలి : మాలమహానాడు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల సీట్ల సంఖ్య పెంచాలని మాల మహానాడు నాయకులు పెద్దోళ్ళ వీరభద్ర కోరారు. సోమవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఐదో తరగతి వరకే పరిమితమవుతున్నారని తెలిపారు. పాఠశాలలో సీట్లు పెంచి పేద విద్యార్థులకు విద్యనందించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ... సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఉపేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటాలి

- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యత ర్యాలీ

ప్రజాశక్తి - దేవనకొండ

దేశ ప్రజలు మతోన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని వ్యతిరేకించి ఐక్యతను చాటాలని వామపక్షాలు, వైసిపి నాయకులు కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేవనకొండలో సిపిఎం, సిపిఐ, వైసిపి ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి బస్టాండ్‌లో సభ నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి నరసారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు మద్దిలేటి శెట్టి, వీరశేఖర్, కిట్టు మాట్లాడారు. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని, ముష్కరుల నుంచి దేశాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఒక మతానికి, ఒక కులానికి అంటగట్టడం శోచనీయమని విమర్శించారు. దేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని, మతోన్మాదం, ఉగ్రవాదం కులాన్ని, మతాన్ని చూడదని, హింసయే వాటి మార్గమని తెలిపారు. ప్రజలందరూ వీటికి వ్యతిరేకంగా, ఐక్యంగా నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతి ఐక్యతను భంగపరిచే మతోన్మాదాన్ని రెచ్చగొట్టే వారిని రాజకీయాలు, మతాలు, కులాలకతీతంగా వ్యతిరేకించాలని కోరారు. దేశంలో మతోన్మాద దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మైనార్టీలపై దాడులను, హక్కులను కాపాడడంలో ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యూసుఫ్ బాషా, అశోక్, బజారి, రంగస్వామి, రంగన్న, మహేష్, నాగరాజు, కుమార్, రంగడు, చంద్రన్న, కొండన్న, పెద్ద రంగన్న, నరసింహుడు పాల్గొన్నారు. **మంత్రాలయంలో** సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గంటపాటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ తాలూకా నాయకులు భాస్కర్ యాదవ్, సిపిఎం పెద్దకడబూ రు, మంత్రాలయం మండలాల నాయకులు తిక్కన్న, హెచ్.జయరాజు మాట్లాడారు. ఉగ్రవాదాన్ని నశింపజేసి, దేశ సమైక్యతను కాపాడుకోవాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమ వుతుందని తెలిపారు. దేశంలో మతోన్మాదులు ఎక్కువై ఎక్కడ చూసినా దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమైన విషయమని విమర్శించారు. దేశ సమగ్రత కోసం, ఉగ్రవాదం, మతోన్మా దానికి వ్యతిరేకంగా వామపక్షాలు పోరాడుతూనే ఉంటాయని తెలిపారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు ప్రజలు, కేంద్ర ప్రభుత్వంతో పాటు వామపక్ష పార్టీలు, ప్రతి ఒక్కరూ అండగా ఉంటారని చెప్పారు. సిపిఐ నాయ కులు లక్ష్మన్న నాయక్, గాబ్రియేలు, ఎఐవైఎఫ్ నాయకులు రాజు, సిపిఎం నాయకులు శ్రీనివాసులు, బి.అనిల్, ప్రాణేష్, ఆంధ్రయ్య, వీరేష్, డివైఎఫ్ఐ నాయకులు సద్దాం పాల్గొన్నారు.

దేవనకొండలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువులు అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు ఎరువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆదోని డివిజన్ వ్యవసాయ అధికారి బాలవర్ధిరాజు హెచ్చరించారు. సోమవారం సిరుగుప్ప క్రాస్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువుల కొరతను అధిగమించేందుకు ఎరువులు ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు తరలి వెళ్లకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ బృందంలో రెవెన్యూ, వ్యవసాయం, పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఉంటారని చెప్పారు. వ్యాపారులు అక్రమంగా ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఐ అశోక్ కుమార్ రెడ్డి, రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్య పాల్గొన్నారు.

టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్ రాజీనామా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి, తనకు అప్పజెప్పిన పార్టీ బాధ్యతలకు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ విజిఎ.దయా సాగర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. గత 11 ఏళ్లుగా టిడిపి ఎన్నో బాధ్యతలు అప్పజెప్పిందని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పని చేస్తున్నానని చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాను పార్టీ బాధ్యులకు పంపుతున్నట్టు తెలిపారు.

ధర్నాతో దిగొచ్చిన యాజమాన్యం

- సిఐటియు నాయకుల చొరవతో విధుల్లోకి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం, చెట్నిహల్లి గ్రామాల మధ్య ఉన్న మారుతి ఇస్పాత్ ఉక్కు ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగులను కారణం చూపకుండా తొలగించిన నేపథ్యంలో చేపట్టిన ధర్నాతో యాజమాన్యం దిగొచ్చింది. ఆదివారం ఉద్యోగులు టిప్పు సుల్తాన్, రాజశేఖర్ యాదవ్, ప్రభాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన మీడియాలో రావడంతో సిఐటియు నాయకులు స్పందించి సోమవారం ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ఉద్యోగుల సమస్యపై ఆరా తీశారు. గత 8 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని కారణం లేకుండా తొలగించారని ఆవేదన వ్యక్తం చేయడంతో సిఐటియు నాయకులు తిక్కన్న, జయరాజు, ఇతర నాయకులతో కలిసి యాజమాన్యంతో చర్చించారు. ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవడంతో ఉద్యోగులు సిఐటియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాసిరకం పత్తి విత్తనాలను అరికట్టాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నాసిరకం పత్తి విత్తనాలను అరికట్టి, ప్రభుత్వం అన్ని రకాల సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈఏడాది వర్షాలు ముందుగా కురవడంతో విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొంతమంది వ్యాపారులు నాసిరకం విత్తనాలు అంటగట్టడానికి రంగంలో దిగారని విమర్శించారు. ప్రభుత్వం ఇంతవరకు సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయకపోవడం, రకరకాల కంపెనీల పేరుతో పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి రావడంతో ఏ విత్తనాలు కొనాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు తెలిపారు. ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలో తెలపడంలో వ్యవసాయ అధికారులు వెనుక పడ్డారని మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు పత్తి, వేరుశనగ, కొర్రలు, సజ్జలు, జొన్నలు, కంది, ఇతర అన్ని రకాల సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సహాయం వెంటనే అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అయ్యప్ప, ఈరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేద రోగులను ఆదుకుందాం

- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

రోగులు సమతుల్య ఆహారం తీసుకుంటే టిబి వ్యాధి నయం అవుతుందని, వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావాలని మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి తెలిపారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ నగర్‌లో టిబి ముక్త్ భారత్ అభియాన్ టిబి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిబి వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని, గళ్ల పరీక్ష నిర్వహించుకుని వ్యాధి నిర్ధారణ కాగానే ఉచిత మందులు అందజేస్తారని తెలిపారు. రోగులు తగి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు వై.లక్ష్మి, ఎంఎటిసి షేకున్ భాను, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, సూపర్‌వైజర్లు బాబు రాజు, జ్ఞానేశ్వరి, టిబి హెచ్‌వి సుబ్బమ్మ బాయి, ఫీల్డ్ కోఆర్డినేటర్ వీరేష్ ఉన్నారు. **దేవనకొండ** మండలంలోని నెల్లిబండ గ్రామంలో వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామిరెడ్డి ఆకస్మికంగా ఆ గ్రామాన్ని సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పి.కోటకొండ గ్రామంలో 4న, తెర్నేకల్ గ్రామంలో 6న ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఆయా గ్రామస్తుల ఉపయోగించుకోవాలని కోరారు. మాజీ సర్పంచి మల్లికార్జున గౌడ్, టిబి సూపర్‌వైజర్ వీరన్న, ఆరోగ్య పర్యవేక్షకులు మద్దిలేటి, ఆరోగ్య కార్యకర్త సుజాత, పెద్ద లక్ష్మి, టిబి ల్యాబ్ టెక్నీషియన్ దాదా వలీ, నాగన్న పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

దేవనకొండలో పర్యవేక్షిస్తున్న రఘురామిరెడ్డి

తాగునీటిని వృథా చేయవద్దు

- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి కోరారు. సోమవారం బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, డిప్యూటీ ఇంజినీర్లు గోపీనాథ్, రామమూర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలో సుమారు 2 లక్షల జనాభా ఉందని, రోజుకు 30 మిలియన్ లీటర్ల తాగునీరు అవసరమని అధికారులు చెబుతున్నారని అన్నారు. ప్రస్తుతం బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 30 రోజులకు సరిపడా నీరు నిల్వ ఉందని తెలిపారు. నీటి ఎద్దడి రాకుండా నాలుగు రోజులకోసారి తాగునీరు వదిలేలా చూస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడారు. తాగునీటి ఎద్దడి తీవ్రతను గమనించి ఎస్ఎస్ ట్యాంకు పటిష్టత కోసం రూ.45 కోట్లు అవసరమని ప్రతిపాదన చేశామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా అమృత్ స్కీం కింద రూ.20 కోట్లు తాగునీటి అవసరాల నిమిత్తం మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సైడ్ వాలు పటిష్టత, రాంజల వద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. డిఇ గోపీనాథ్ మాట్లాడుతూ... రాంజలలో 350 మిలియన్ లీటర్లు, బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 1000 మిలియన్ లీటర్ల స్టోరేజ్ ఉందన్నారు. ఎల్ఎల్‌సి మరమ్మతుల కారణంగా డ్యామ్ నుంచి నీరు వదిలేందుకు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ముందు జాగ్రత్త చర్యగా రాంజలలో కూడా తాగునీటిని నిల్వ ఉంచామని తెలిపారు. నీటి ఎద్దడి రాకుండా ఎల్ఎల్‌సి అధికారులతో మాట్లాడి త్వరగా నీరు విడుదలయ్యేలా చూస్తామన్నారు. కౌన్సిలర్లు ఫయాజ్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మి, ఛైర్మన్ భర్త నాగరాజు, నాయకులు భాస్కర్ ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

అక్రమ కనెక్షన్లను తొలగించి రైతులను ఆదుకోవాలి

- వైసిపి రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె ఎత్తిపోతల పథకం పైపులైన్‌కు కొంతమంది చిన్నకొత్తిలి పొలాల దగ్గర అక్రమంగా పైపు కనెక్షన్లు ఇచ్చారని, వాటిని తొలగించి రైతులను ఆదుకోవాలని వైసిపి రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. పైపులైన్‌కు అక్రమంగా కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఆ స్కీమ్ వల్ల లబ్ధి పొందే రైతులు నష్టపోతారని తెలిపారు. చిన్నకొత్తిలి దగ్గర పైపులైన్‌ను మూయించి నాగలదిన్నె రైతులను కాపాడాలని, వారిపైన కేసులు నమోదు చేయాలని ఐడిసి అధికారులను కోరారు. చిన్నకొత్తిలి దగ్గర కొంతమంది నాగలదిన్నె స్కీం పైపును పగలగొట్టి ఐదు ఇంచుల పైపు వేసుకొని 30 ఎకరాలకు నీరు వచ్చేటట్లు ఏర్పాటు చేసుకోవడం, దీనిపై డబ్బులు వసూలు చేసుకోవడం నీచమైన వ్యవహారమని మండిపడ్డారు. ఎమ్మెల్యేకు తాము చెబితే ఎదురులేదని, ఆ వ్యక్తులు ఎమ్మెల్యే పేరు చెబుతూ ఇలా రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఎమ్మెల్యేను అడిగి 1000, 1500 ఎకరాలకు కొత్త స్కీం ఇప్పించండని, ప్రజలు కూడా సంతోషిస్తారని చెప్పారు. నాగలదిన్నె రైతుల కడుపుకొట్టి నీరు వాడుకోవడం ఎంతవరకు సముచితమని ప్రశ్నించారు. ఇంత తతంగం జరిగినా ఏమీ తెలియనట్లు ఐడిసి అధికారులు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. అధికారులు పైపులైన్‌ను మూయించి నాగలదిన్నె రైతులకు న్యాయం చేయాలని కోరారు. నాగలదిన్నె రైతులు స్పందించకపోతే ఎల్ఎల్‌సి కాలువకు పట్టిన గతే పడుతుందని, రైతులు స్పందించి మేలుకోవాలని కోరారు.

'సూపర్ సిక్స్' అమలులో కూటమి విఫలం : వైసిపి

ప్రజాశక్తి - ఆస్పరి

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడిసె మహానంది, వైసిపి జిల్లా కార్యదర్శి పెద్దయ్య, మండల కార్యదర్శి బసవరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, జడ్‌పిటిసి దొరబాబు విమర్శించారు. సోమవారం స్థానిక గాంధీ పార్కులో వెన్నుపోటు దినం గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తోందని విమర్శించారు. సూపర్ సిక్స్ అమలు చేస్తామని చంద్రబాబు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప ఇతర ఏ పథకాలూ అమలు కావడం లేదని తెలిపారు. ఈనెల 4న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశాల మేరకు నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచులు వెంకటేష్, పెద్దిరెడ్డి, ఎంపిటిసి రాధాకృష్ణ, తాలూకా యూత్ అధ్యక్షులు అశోక్, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు శివానంద, తిమ్మప్ప, ప్రకాష్, శివ, లక్ష్మన్న, చిన్న రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పరిలో గోడపత్రికను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

చిప్పగిరి : ఆచరణకు సాధ్యం కాని వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, రాష్ట్ర పంచాయతీ విభాగం అధ్యక్షులు ఓబులేసు విమర్శించారు. చిప్పగిరిలో వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు టిడిపి ఏడాది పాలనపై ఆలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే విరుపాక్షి ఆధ్వర్యంలో ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. వైసిపి నాయకులు నాగప్ప, లోకనాథ్, మల్లికార్జున, లాలూ స్వామి, సేనాపతి, నాగేంద్ర, వెంకటేష్, శివ యోగి, రామచంద్ర, కొండ పెద్దన్న, సూరి, నాని, జ్ఞాన్ పాల్గొన్నారు.

చిప్పగిరిలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆస్పరి

మద్యానికి బానిసై మతిస్థిమితం లేక పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఆస్పరిలో చోటు చేసుకుంది. ఆస్పరిలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న పొలంలో పురుగు మందు తాగి పడి ఉన్న మంగలి నాగేష్ (45)ను పొలంలో పనిచేస్తున్న కూలీలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగేష్ భార్య సుజాత, బంధువులు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన మంగలి నాగేష్ గత మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయారు. సోమవారం కర్నూలు నుంచి పోలకల్, పోలకల్ నుంచి కోడుమూరు, కోడుమూరు నుంచి ఆస్పరికి వచ్చినట్లు బస్సు టికెట్లు కూడా ఉన్నాయి. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నాగేష్ మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం స్త్రీ శక్తి మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం ఎంపిడిఒ వీర శేఖర్ రావు ఆధ్వర్యంలో విజేతలను ఎంపిక చేసి మొదటి, రెండు, మూడో బహుమతులు అందజేశారు. మండల సమైక్య అధ్యక్షులు, ఎపిఎం ఫరీద్ ఖాన్, సిసిలు ఎంకన్న, బజారప్ప, అకౌంటెంట్ మంజునాథ్ పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

- నవోదయ ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

నవోదయ విద్యాలయ సమితి వారు 2026-27వ విద్యా సంవత్సరానికి గాను బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు https://cbseitms.rcil.gov.in/nvs వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- అభ్యర్థులు 3వ, 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
- 5వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలి.
- అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాంతం వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- అభ్యర్థులు మే 1, 2014 నుంచి జులై 31, 2016 మధ్య జన్మించిన వారై ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ : 29-07-2025
- ఎంపిక పరీక్ష తేదీ : 13-12-2025

ఇతరత వివరాలకు website:https://cbseitms.rcil.gov.in/nvs వెబ్ సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు

- జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఈషా బాషా

ప్రజాశక్తి - ఆదోని



రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కర్నూలు జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఈషా బాషా హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. కార్డుదారులు ప్రతి నెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపుల్లో రేషన్ పొందవచ్చని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటికే సరుకులు చేర్పించే సదుపాయాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. తూకాల్లో గాని, రేషన్ పంపిణీ సమయాల్లో గాని, ప్రభుత్వం నియమించిన విధానాల్లో గాని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల కోసం ప్రభుత్వం రేషన్ షాపుల ఎదుట బోర్డులు ఏర్పాటు చేసిందని, ఇకపై డీలర్లు బాధ్యతగా రేషన్ సరుకుల పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ షాపుల వద్ద ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురైనా ఆదోని డివిజన్ వినియోగదారుల రక్షణ మండలిని సంప్రదించాలని కోరారు. 9014251444, 9014238444 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నమ్ముకున్న వారికి కొండంత అండ తిక్కారెడ్డి

- టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

నమ్ముకున్న వారికి టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అండగా ఉంటారని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి తెలిపారు. సోమవారం తిక్కారెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి తిక్కారెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిక్కారెడ్డి అంటే ఒక నమ్మకమని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఒకే విధంగా ఉంటూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, వెనకడుగు వేసే వ్యక్తిత్వం ఆయనది కాదని చెప్పారు. ఎన్ని ఒడిదడుకులు వచ్చినా అలుపెరగకుండా పోరాటం చేస్తారని తెలిపారు. ఏదైన ఉంటే నిర్మొహమాటంగా మాట్లాడే తత్వమని చెప్పారు. జయాపజయాల్లో ఒకే మాదిరిగా ఉంటారని తెలిపారు. నాయకులు కృష్ణమోహన్ రెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, హండె హనుమంతు, విద్యా కమిటీ ఛైర్మన్ గణేకంటి గురురాజ, నాయకులు గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ వనికె నాగరాజు, తిక్కస్వామి, రవి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, నారాయణ పాల్గొన్నారు.

వెంకటేష్ స్వామికి కేక్ తినిపిస్తున్న నాయకులు

కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 196/2023
పి.జగదీశ్వరగౌడ్. ...వాది
వర్సెస్
యం.డి.ఫార్మన్
S/o యం.డి.రఫీ
ఇంటి నెం.45-24- K 46-1E
అజుమొద్దిన్, కర్నూలు. ...ప్రతివాదులు
సమన్లు
పై దావాలోని ప్రతివాది ప్రామిసరీ నోటు మొత్తము 1,71,666/- ఇందుకు వడ్డీ వగైరాలు వాదికి యివ్వనందున ఎన్ని సమనులు ప్రతివాదికి పంపినను ముట్టనందువలన పేపరులో వేయడమైనది. 19-06-2025న ఉదయం 10.30 గంటలకు పైకోర్టు నందు ఏమైన అభ్యంతరములున్నచో స్వతంత్రంగా గాని వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల మీపరోక్షముగా తీర్మానించబడును.
వాది పరం వకీలు
P.V. Ramana Reddy,
Advocate,
Kurnool.

ప్రకటన
మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో : కర్నూలు
I.P.No. 108/2014
సి.వసుందరమ్మ Repbyits
GPA హోల్డర్ సి.రాజశేఖర్‌శర్మ. ...అర్జీదారు
వర్సెస్
1) ఎస్.చంద్రయ్య తండ్రి లేట్ సుంకన్న మరియు ఇతరులు. ...రెస్పాండెంట్స్
నోటీసు టు రెస్పాండెంట్స్ 5 మరియు 6
R5) మల్లెపోగు కిషోర్ తండ్రి ఎం.నాగరాజు వయసు 39 సంవత్సరాలు, ప్రైవేట్ ఎంప్లాయ్, డోర్ నెంబర్ 49/113, బుధవారపేట, కర్నూలు.
R6) మల్లెపోగు కిరణ్ తండ్రి ఎం.నాగరాజు వయసు 38 సంవత్సరాలు, ప్రైవేట్ ఎంప్లాయ్, డోర్ నెంబర్ 49/113, బుధవారపేట, కర్నూలు.
R5 and R6 రెస్పాండెంట్స్ అయిన మీకు ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై నెంబరు I.Pలో రెండవ రెస్పాండెంట్ అయిన ఎస్.మంజుల చనిపోయినందున ఆమె వారసులుగా రెస్పాండెంట్స్ 3,4,5 మరియు 6 లను చేర్చడమైనది. సదరు విషయమై రెస్పాండెంట్స్ 5 మరియు 6 అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నాయి. ఎడల తేది 20-06-2025న ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను లేనంతట మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
యం.డి.వి జోగయ్యశర్మ,
అర్జీదారుపరము అడ్వకేటు,
కర్నూలు.